# దివ్యదర్శనం

"మీరు రావడం చాలా మంచిదయింది, సుందరం గారూ!" అంటున్నది సునంద ఆప్యాయంగా.

సాయంకాలం అయిదున్నర కావస్తున్నది.

ముందు గదిలో కిటికీలో నుంచి నీరెండ రాధాకృష్ణుల కేలండర్ మీద పడి ఒక వింత వెలుగును విరజిమ్ముతోంది.

కృష్ణమూర్తి స్తబ్దుగా కూర్చుండిపోయినాడు.

సాయంకాలం ఎంతో ఉల్లాసంగా గడిపేవాడు. ఏ హోటల్‌కో వెళ్ళి ఓ కప్పు కాఫీ తాగి, దగ్గరగా ఉండే మిత్రుడి ఇంటికి వెళ్ళి ఓ గంట పిచ్చాపాటి మాట్లాడి ఎనిమిదింటికి వస్తే గాని ఆ రోజు హాయిగా గడిచినట్లు కాదనిపిస్తుంది అతడికి. ఈ నాలుగురోజుల నుంచీ ఎక్కడకూ వెళ్ళాలనిపించటం లేదు.

"పెళ్ళి బాగా జరిగిందా?"

ఉలిక్కిపడ్డాడు కృష్ణమూర్తి. సుందరరావు పెళ్ళికి రాలేదని స్ఫురణకు వచ్చింది.

"బాగానే జరిగింది" అన్నది సునంద. కాని, ఆ మాటల్లో ఏదో పోగొట్టుకున్న వెలితి. సుందరం వరండా మెట్ల మీద కాసేపు నిలుచుని సునందతో ఏదో చెప్తున్నాడు. పెళ్ళికి తా నెందుకు రాలేకపోయిందీ నొచ్చుకుంటూ, సాగదీస్తూ చెప్తున్నాడు. అది అతని మామూలు ధోరణి.

"ఎంత అందంగా పూశాయండీ సంధ్య మల్లెపూలు!" అంటూ సుందరరావు గదిలోకి అడుగు పెట్టాడు. అలా అనటం అతడికి రివాజు.

వరండా పక్కనే మెట్ల కింద రకరకాల రంగుల పూలు సాయంకాలం కాగానే విచ్చుకోవటం,సుందరం వచ్చినప్పుడల్లా వాటిని మెచ్చుకోవడం మామూలే. శీతాకాలం ఆ పూలు ముఖ్యంగా సొగసులు విరజిమ్ముతాయి.

"క్షమించాలి" అంటూ చేయి జాచాడు సుందరం.

కృష్ణమూర్తికి ఆ చేతిని అందుకోవడం కూడా ఇష్టం లేనట్లు, "కూర్చో కూర్చో!" అన్నాడు నీరసంగా.

"ఏమిటి కృష్ణా! దివాలా తీసినట్లు కనపడుతున్నావు. ఒక లక్ష రూపాయలు ఖర్చుచేసి బిడ్డ పెళ్ళి చేశావు. మహామహులు కూడా ఈ రోజుల్లో కూతురి పెళ్ళి చేయలేక నానా యాతనలూ పడుతున్నారు. నీవు అదృష్టవంతుడివి. మనవాళ్ళంతా పెళ్ళి చాలా బాగా జరిగిం దంటున్నారు. నీ వెందు కింత 'డల్'గా ఉన్నావు? అలా నారాయణ గూడా సెంటర్‌దాకా పోయివద్దాం, రాకూడదూ?"

"కూర్చో, కూర్చో! నీవు మా అమ్మాయి పెళ్ళికి రాకపోవడం చాలా మంచిదైందిలే. ఆ కబురు నీ చెవిన పడలేదా?"

"ఏ కబురు? ఏమిటీ నీ వంటున్నది! నీవు మెత్తగా చీవాట్లు పెడతావని భయపడుతూ వచ్చాను. నీవేమో ఇలా వింత నిష్ఠురం మొదలుపెట్టావు."

సునంద రెండు కప్పుల్లో టీ తెచ్చింది.

"ఇదుగో ఇది మీది! ఆవిర్లు రావాలంటారు కదా?" అని ఓ కప్పు సుందరాని కందించింది.

భర్త పక్కనే టీపాయ్ మీద మరో కప్పు పెట్టింది.

"మీ రీ పూట ఇక్కడే భోజనంచేసి వెడుదురుగాని, పెళ్ళికి చేయించిన స్వీట్స్ రుచి చూద్దురుగాని" అని సుందరంతో ఆప్యాయంగా చెప్పి లోపలికి వెళ్ళిపోయింది సునంద.

"నీతో ఈ ముచ్చట చెప్పాలా, వద్దా అని నాలుగు రోజుల నుంచీ మథనపడుతున్నాను, సుందరం!" అని ఓ క్షణం విరామంతో టీ చప్పరించాడు కృష్ణమూర్తి.

ఏమిటో వింతగా అనిపించింది సుందరానికి. ముప్పై ఏళ్లుగా కృష్ణమూర్తిని సన్నిహితంగా ఎరుగును తాను. అతి రహస్యమైన, కేవలం వ్యక్తిగతమైన విషయాలు కూడా తన కెన్నో చెప్పాడు కృష్ణమూర్తి కాని, ఇప్పుడతడి కంఠంలో, ముఖంలో ఏదో భావోద్వేగం కనపడుతున్నది. ఏదైనా విషయం చెప్పటానికి బోలెడంత ఉపోద్ఘాతంతో మొదలెడితే గాని సాగదు కృష్ణమూర్తికి. "అయితే చెప్పు" అన్నాడు సుందరం.

మళ్ళీ కల్పించుకుని "నీదాకా రాలేదా? అన్నాడు కృష్ణమూర్తి.

"ఏమిటీ? పెళ్లి బాగా జరిగిందని అందరూ అన్నారు."

"బాగా జరిగిందో, లేదో నాకు తెలియదు. కానైతే ఒక గంట సేపు పెద్ద గొడవ జరిగింది. ఈ గందరగోళంనుంచి బయడపడతానా, లేదా అని భయం పుట్టింది. ఎంత నిబ్బరంగా ఉందా మనుకున్నా ఏమిటో వణుకు పట్టుకుంది. రసాభాస అయిపోతే ఏం కావాలి నేను? ఒక పక్కన మా ఆవిడ కన్నీళ్లు. మా అమ్మాయి బిక్కమొహం వేసుకుని అసహాయంగా చూస్తూంటే నా కడుపులో దుఃఖం సుడి తిరిగింది. అయితే- నా కేమిటో మెండి ధైర్యం, అంతా బాగానే జరిగిపోతుందని గట్టి నమ్మకం.

"కాని-మా ఆవిణ్ణి, మా అమ్మాయిని సంతోషంగా, నిబ్బరంగా ఉండమని ఎలా చెప్పటం? వాళ్లు అలా ఉండగలిగేలా ఎలా చేయటం? ఇంతలో మా వదినగారు వచ్చి 'వాళ్లు హోటలుకు వెళ్లిపోతారట. భోజనానికి ఆలస్యమైపోయిందని తగువు తెచ్చారు. మర్యాద సరిగా జరగలేదట' అని నాతో చెప్పింది.

"ఒక్క క్షణం నా తల దిమ్మెక్కిపోయింది. కోపం, అసహనం, చీదరింపు కలిగాయి.

"ఈ ఇరవయ్యో శతాబ్దం కూడా వెళ్లిపోతున్న ఈ తరుణంలో ఇదేమిటి ఇంత వింత ప్రవర్తన? అప్పటికింకా తొమ్మిదికూడా కాలేదు. ఇంకో గంటలో లగ్నం. ఇప్పుడిలా ప్రవర్తిస్తారా? అని ఉడుకుమోత్తనం వచ్చింది. 'లక్షణంగా వెళ్లి భోం చేసి రమ్మను' అన్నాను ఉద్రేకంగా. 'ఏమయ్యా! ఎంత మాట పడిలే అంతమాట అనేసెయ్యడమేనా? కాస్త నిలుపూ, నిదానమూ ఉండాలా, అక్కర్లేదా? ఇటువంటి తూలు మాటల వల్లే కొంప లంటుకొనిపోయేది! నీవేం మాట్లాడకు. ఈ మాట కాస్తా వాళ్ల కెవరో మోసేస్తారు. వాళ్లు నిజంగానే హోటలు కెళ్లిపోతే మన గతేం కాను.' అని తీర్పు చెప్పడానికి పూనుకున్నది మా వదిన. అప్పటి దాకా మా అమ్మాయి పక్కనే కూర్చుని గౌరీ పూజ చేయిస్తున్న నాకు హడలు పట్టుకున్నది. మా ఆవిడ మగపెళ్లివారిని బతిమిలాడటానికి వెళ్లింది కాబోలు - కళ్లనిండా నీళ్లు పెట్టుకుని వచ్చి 'పెళ్లయిన తర్వాత మనమ్మాయిని మనింటికి పంపించరట. మన మింత పనికి మాలిన వాళ్లమని తెలుసుకోలేకపోయారట' అని ముక్కు చీదుకోవటం ప్రారంభించింది.

"పిచ్చిదానా! అలా జరగదు. మనమ్మాయి చక్కగా చదువు కున్నది. ఉద్యోగం చేస్తున్నది. మనింటికి రాకుండా ఎవరూ నిర్బంధించలేరు" అని నేను ఎంత ఓదారుస్తున్నా ఆమె దుఃఖం ఆగడంలేదు.

"అసలు విషయ మేమిటో నాకు బోధ పడలేదు. మర్యాద అనేది ఒకరిస్తే వచ్చేది కాదు. తాము నిలుపుకోవాల్సింది. ఒక రోజు మర్యాద కోసం, జీవితాంతం మర్యాద పోగొట్టుకుంటే ఏం లాభం అని నేనేదో ప్రవచనాలు పలకడం చూసి మా ఆవిడ బేలగా మరింత కళ్లూ,

ముక్కూ తుడుచుకోవటం సాగించింది. ఇక నేను కూడా వాళ్లని బతిమాలి, బామాలి ప్రశాంతచిత్తుల్ని చేద్దామని వెళ్లాను.

"పెళ్లి కొడుకు పినతండ్రి కొడుకో, పినతల్లి కూతురు భర్తో నా కింకా వాళ్లబాంధవ్యం పూర్తిగా పట్టుపడలేదు. 'మేం వెళ్లిపోతున్నా మండీ! హోటలు కెళ్లి భోం చేసి వస్తాం' అని నా మీదికి హాస్యపు దుడ్డుకర్ర ఎత్తి కొట్టడానికి వచ్చాడు. 'అలావెళ్తే ఎట్లా? క్షమించండి. పొరపాటు జరిగింది నా వల్ల. మీరు క్షమించాలి' అని బతిమాలు కుంటూ చెప్పాను. 'లాభం లేదండీ! సమయం మించిపోయింది. మర్యాద తెలియని మూర్ఖులనీ, అసమర్థులనీ అనుకుంటే మేమీ పెళ్లికి వచ్చేవాళ్లమే కాము' అని రుసరుస లాడుతూ నవ్వు మొహం పెట్టాడా మగపెళ్లివారి వీరుడు. అక్కడ ఏం జరుగుతున్నదీ నాకు తెలియ లేదు. నా తమ్ముళ్లూ, చెల్లెళ్లూ చేతులు తిప్పుకుంటూ పరుగులు తీస్తు న్నారు. రెండో పక్షం వాళ్లు ముఖాలు చెండుకుని ఆదరా బాదరా అరుచుకుంటూ తిరుగుతున్నారు. ఇద్దరు ముగ్గురు ఒకచోట చేరి ఒకరి కొకరు హెచ్చరించుకుంటున్నారు. నా పైన గేలి చూపులు రువ్వు తున్నారు. ఇంతలో పెళ్లి తంతు నిర్వహించే మా పురోహితుడు వచ్చి 'ఇట్లా తాత్సారం చేస్తే ఎట్లానండీ? మీ రుభయులూ వచ్చి కూర్చోవాలి. వధూవరుల మంగళ స్నానాలు కావాలి' అని నా చేయి పట్టుకుని లాక్కువెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు. మా ఆవిడ ఏదీ? ఎక్కడుంది?

"నాకు తెలిసిన వాళ్ళెందరో వచ్చి తమ సంతోషం వెలిబుచ్చు తున్నారు అదే సమయంలో. వాళ్ళు అట్లా అభినందిస్తూ ఉంటే నా కడుపులో ఏదో దేవుతున్నట్లుగా బాధపడ్డాను. 'భోజనం చేసి పొండి' అని ప్రాధేయపూర్వకంగా, యాంత్రికంగా అంటూ వచ్చాను. 'మాకు మాత్రం గడ్డి పెట్టారుగా!' అని వ్యంగ్యంగా పెళ్ళివారి వీరుడు నాపై విరుచుకుపడ్డాడు. నాకు చాలా సిగ్గూ, దుఃఖమూ, ఏవగింపూ కలిగాయి.

"మా చెల్లెలు వచ్చి- అసలే పెద్దపెద్ద కళ్ళు- దైన్యంతో 'ఎంత చెప్పినా వినటంలేదు, నానా మాట లా అంటున్నారు' అని కన్నీళ్ళ పర్యంతమయింది. మా ఆవిడ ఎక్కడుందో, ఎక్కడ తప్పిపోయిందో కనుక్కోవడం కష్టమైపోయింది.

"ఇంతలో- సుందరం! విను, అసలు కథ ఇక్కడే మొదలవుతున్నది. కీలక ఘట్టం ఇదే. నీకు తెలుసుగా, నేను సరాసరి సూటిగా కథా ఘట్టంలోకి వచ్చేయలేను. ఒక తమాషా జరిగింది. నీకు తెలుసు-ప్రమదా భవనం చాలా విశాలమైన కళ్యాణమండపం. ఒకవైపు భవనం పొడుగునా విశాలమైన వరండా ఉంది. దానికి దిగువనే షామియానా కింద కోలాహలంగా 'బఫే' సాగుతోంది. వీడియో ఫ్లాష్ కాంతులు నాలుగు మూలలా ప్రసరిస్తున్నాయి. నవ్వులు, కేరింతలు, సుతారమైన పట్టుచీరల రెపరెపల తళతళల పరిమళాలు, 'హలో!'లు నమస్కారాలు, అభినందనలు- 'నేను' ఫలానాలు, ఒక సురుచిర స్వప్నం- ఒక సుందర దృశ్యం- ఒక ప్రశాంత నీల గగనంలో ఒక దివ్య నక్షత్రం కాంతి ఇంతింతై అంతై విస్తరిస్తున్న భ్రమలాంటి విభ్రాంతి.

"నేను గుర్తున్నానా అన్నారు ఎవరో ఒక వైపుకు తిరిగిన నాతో అర్ధ వలయాభిముఖంగా. ఆమెకు ఇరవై ఏళ్ళు ఉండవచ్చు. ఏమైనా పాతిక లోపు. ఎవరో ఒక గొప్ప కవి పెళ్ళి కూతురి మంద హాసాన్ని 'గులాబి పూలదండలో విరిమల్లెలు దాపినట్లుగ' అని ఉప మించాడు. అలాంటి పెదవులు ఎక్కడా నేను చూడలేదు. ఆ కళ్ళలోకి చూడాలంటే నాకు భయం అనిపించింది. ఆమె పెదవులు అంత సుతారంగా దరహసిస్తాయి. తానెవరో చెప్పదు. పాదాల నుంచి పెదవుల వరకు చూపు నిలిపి ఆమె వైపు చూడలేకపోయాను. ప్రపంచంలో ఎవరినీ చూసి భయపడనంతగా నన్ను నేను తలచుకుని భయపడతాను.

"నా బలహీనత నాకు తెలుసు. తేరిపార చూస్తే నాలో కలిగే ఊహలేమిటో నాకు తెలియవా? చేతులు జోడిస్తాను. కాని, చేతంలో వెర్రి వేషాలు నాకు తెలియవా? అంచేత ధైర్యంగా అమ్మవైపో, అక్కవైపో చూసినట్లు చూడలేకపోయాను. ఆమె ఎవరో నాకు ఎంత సేపటికీ గుర్తురాలేదు. మనస్సంతా చీకాకుగా ఉంది. చిందర వందరగా ఉంది. నాకు పరిచయం ఉన్న ఏ కుటుంబంలోనూ ఆమెను ఇంత వరకు నేను చూసినట్లు గుర్తులేదు. పెళ్ళివారి వైపు బంధువా అంటే- పొద్దున వాళ్ళను పరిచయం చేసుకుంటున్నప్పటి సమయంలో ఆ గుంపులో ఆమెను నేను చూడలేదు.

"నిదానంగా ఒకసారి ఆమెను తేరిపార చూసిన వాళ్ళెవరూ ఆ అందాన్ని మరచిపోగలగడం సాధ్యమా? ఆ నాజూకుతనాన్ని, ఆ మాట పొందికను, ఆ లావణ్యాన్ని, ఆ సోయగాన్ని, ఆ నిశ్చల త్వాన్ని, ఆ ప్రశాంత మనోహరతను ఓసారి కంటబడ్డవారెవరైనా మరచిపోగలరా? ఇంతకూ ఆమె మగపెళ్ళి వారివైపు బంధువుకాదేమో! ఆమె నాతో అన్నది- 'మిమ్మల్ని గురువు గారి దగ్గర చాలాసార్లు చూశాను. మే మీ మధ్య గురువుగారితోనే ఉన్నాం. వారు మొన్ననే ఇక్కడ నుంచి వెళ్లారు. మేము కూడా మళ్ళీ ఆయన దగ్గరకే వెళ్తాం రేపో, మాపో!' అని ప్రసన్న మధురంగా పెదవులు విడకుండా నవ్వి- 'పోనీ, నేను చెప్పనా మగపెళ్లి వారికి? వాళ్ళు నాకు తెలుసు. నేను చెప్తానులెండి! మీ రెందుకు దిగులు పడతారు?' అని అలవోకగా హసించింది ఆమె.

"నే నామెకు నమస్కరించాను.

"నాలో మథన. నా కెవరూ గురువులు లేరు. నేను ఏ మతా చార్యుల సమక్షంలోనూ నా భక్తి ప్రపత్తులు నివేదించలేదు ఈ మధ్య. అంతేకాదు - మతాధిపతులను గురించి, మతాధిపతులను గురించి

నాకెన్నో సందేహాలు, అనుమానాలు, సంశయాలు, అసహనాలు- వీళ్లు? ఈ ప్రపంచాన్ని ఉద్ధరించగలిగే దేమిటి? మార్చగలిగే దేమిటి? లోకం ఎప్పుడూ ఉన్నట్లుగానే ఉందే- ఈ మతాల ఆర్భాటాలేమిటి? అని నాలో నాకే విచికిత్స కలగటం ఈ మధ్య తరచూ ఎక్కువైంది.

"ఈ మధ్య ఓ ఆచార్యుల వారు నగరంలో మూడు నెలలు మకాం వేసిన సంగతి నాకు తెలిసినా ఒకసారి కూడా వెళ్ళి ఆయనను నేను దర్శించలేదు. మరి ఈమె ఎక్కడ నన్ను చాలాసార్లు చూశా నంటుంది! ఏ గురువుగారి దగ్గరా నేను మసలుకోలేదు గదా! ఆ గురువు గారెవరని అడగటానికి నాకు ఆలోచన పోలేదు. సిగ్గనిపించింది, అభిమాన మనిపించింది. అడిగి తెలుసుకోవడం చిన్నతనం కాదూ! నాలో లేని యోగ్యత నామె నాకు ఆపాదిస్తున్నది కదా! అయినా ఆమె మాటలు వినాల్సిందే కాని ఎవరైనా ఆమె ముందు పెదవి విప్పగలుగు తారా? నడయాడే శిల్పం కదా ఆమె! దేవాలయంలో అర్చా విగ్రహం కదా ఆమె!

ఇంతలో మా తమ్ముడు ఎవరినో తీసుకుని వచ్చి, ఫలాని వారు వచ్చారు అని నా దృష్టిని అటువైపు తిప్పాడు. 'అమ్మా! వచ్చారా? మీ వల్ల మేమెంత ఉపకారం పొందాం?' అని వాళ్ళ వల్ల పొందిన మేలును కృతజ్ఞతాభరితంగా స్మరించుకున్నాను. కాని ఒక పక్కన ఏం జరగబోతున్నది? అని మనసు ఆందోళనాభరితంగా ఉంది.

"ఈమె ఎవరు? పేరు గాని, కుటుంబం గాని నాకు ఏమాత్రం జ్ఞాపకం రావటంలేదే! ఇదివరకు ఎక్కడా, ఎప్పుడూ చూసినట్లు కూడా గుర్తులేదు. 'వాళ్ళు నాకు తెలిసినవారే! నేను చెప్పేదా?' అని నన్ను ఊరడిల్లవలసిందిగా ప్రసన్న మధురమైన చల్లని చూపుతో ఇంతకు ముందే చెప్పింది. 'మీ రెవరో జ్ఞాపకం రాపటంలేదు, క్షమించాలి' అని అనటం, అడగటం అమర్యాదకరమూ, అనౌచిత్యమూ అవుతుందేమో -

'భోం చేశారా? రండి, నేనూ వస్తాను, చూపిస్తాను. భోజనం చేసి పోదురు గాని' అని కూడా అనలేకపోయాను.

"మనస్సంతా చాలా బరువుగా ఉంది, ఆరాటంగా ఉంది. అందువల్ల ఎవరైనా ఎదుటపడి పలకరించినా, అభినందించినా వారిని ఆదరంగా పలకరించలేకపోతున్నాను. పోనీ, కనీసం ఆమెను భోజనం చేసి వెళ్లండి- అని కూడా గౌరవించలేదు. నిజంగా ఆమె మాటలు అప్పట్లో నాకు అర్థంకాలేదేమో. 'ప్లీజ్! త్వరగా వెళ్లి వాళ్లకు చెప్పి- అంటే మగపెళ్లి వాళ్లను శాంతపరచండి' అనవలసింది కదా నేను? అట్లా అనలేదు. అసలామె పలుకులు పట్టించుకున్నట్లుకూడా లేదు.

"కాని - గొప్ప విచిత్రంగా ఎవరో అంతా సర్దుబాటు చేసినట్లు మా పురోహితుడు వచ్చి నన్ను లాక్కునిపోయాడు. మగపెళ్లి వారంతా తర్వాత కలాపానికి సిద్ధంగా కూర్చుని ఉన్నారు. వాళ్లకు ఎందుకంత కోపతాపాలు, అసహనం కలిగాయో, అవి ఎట్లా ఇంత త్వరగా ఉపశమించాయో నాకర్థం కాలేదు. ఉధృతంగా కడుపునొప్పి వచ్చి కొద్దిసేపట్లోనే తగ్గిపోయినట్లుగా ఉంది ఈ విచిత్రమైన సన్నివేశం. మగపెళ్ళివారిలో ఇందాకటి ఆవేశం, అసహనం, ఉద్రిక్తత, అసంతృప్తి కూడా ఏమీలేవు. ఏమీ జరగనట్లే వేళాకోళాలు, హాస్యాలు, చిలిపి మాటలు, సరదాలు ప్రయోగించుకుంటున్నారు వాళ్లలో వాళ్ళు. మా ఆవిడకూ, నాకూ ఎందుకిలా జరిగింది అని హృదయంలో విచార రేఖ మెదులుతున్నా, ఆ తర్వాత ఒక్కొక్కటీ క్రమంగా జరిగి పోయాయి. తాళి కట్టడం, పూల దండలు మార్చుకోవడం, అప్పగింతలు కూడా నెమ్మదిగా జరిగిపోయాయి. ఇందులో ఏదో మనకు తెలియని అద్భుతం జరగలేదంటావా?" అని కృష్ణమూర్తి తాపీగా సుందరం కళ్లలోకి గుచ్చిగుచ్చి చూశాడు.

సుందరరావుకి పెద్ద పెట్టున నవ్వాలనిపించింది. కాని కృష్ణమూర్తి నొచ్చుకుంటాడేమోనని తనని తాను తమాయించుకున్నాడు. కృష్ణమూర్తి మనస్తత్వం అతడు పూర్తిగా ఎరుగును. ఆధ్యాత్మికమైన విశ్వాసాలను కృష్ణమూర్తి కాదనడు. అట్లా అని అతడు పూజలు, పునస్కారాలు, గురువులూ, రుద్రాక్షలూ అంటూ దగ్గరి స్నేహితులతోనైనా ప్రసంగించటం సుందరరావు గత ముప్పై సంవత్సరాలుగా ఎరగడు. ఇంకో ఏడాదిలో తామిద్దరూ రిటైరై పోతున్నారు.

సుందర్రావన్నాడు - "నీదంతా భ్రాంతి కాకూడదా? మగపెళ్ళివారికి కూడా ఇంకా అమర్యాదకరంగా ప్రవర్తిస్తే ఎలా పరిణమిస్తుందోనన్న భయం ఉండటంలో మనం ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు. అదీ కాక, అసలువాళ్లకంటే కొసరువాళ్లు ఇలాంటి అసభ్య ప్రవర్తనకు దిగటం ఈనాటికీ సంప్రదాయ వివాహాలలో ఆనవాయితీగా వస్తున్నది. ఇరవయ్యో శతాబ్దం గడిచిపోతున్నా, చదువూ, సంస్కారం ఎంతో ఆశిస్తామనీ, సాధించామనీ అనుకునే సభ్య సమాజం కూడా సంప్రదాయపు పెళ్ళిళ్లలో ఈ అల్లర్లను ఇంకా భరించాల్సి వస్తున్నది. ఇందులో దైవ ఘటన, అద్భుతం ఉన్నాయనుకోవడంలో నీకేదో ఉద్విగ్న సంతృప్తి ఉంటే అందులో ఏమీ నష్టం లేదు కదా!"

"జీవితంలో చిత్రమైన సన్నివేశాలు మనకు తటస్థమవుతూ ఉంటాయి. అనుకున్నవి జరగవు. అనుకోనివి జరుగుతాయి. గాఢంగా వాంఛించినవి అందవు. ఎంతో గొప్పగా, జాగ్రత్తగా ప్రయత్నం చేశాననుకున్నవి విఫలమవుతాయి. కాబట్టి గాఢమైన నమ్మకం వల్ల, ఆక్రందన వల్ల ఏదో శక్తి మనను రక్షిస్తుందనుకోవడంలో అంతో ఇంతో సంతృప్తి కలుగుతుంది కదా!" అన్నాడు కృష్ణమూర్తి.

"నిజాన్ని భ్రాంతిగానూ, భ్రాంతిని నిజంగానూ భావించటంలో మనవంటి సామాన్య మానవుల కేదో ఊరడింపు ఉంటుంది. నీవు ఈ విధమైన సంతృప్తి నేదో పొందాలని చూస్తున్నావు. ఈ రోజుల్లో కూడా మగపెళ్ళివారు అలా ప్రవర్తించడం ఎంత హాస్యాస్పదంగా ఉందో నీవు చెప్పే సంఘటన పర్యవసానపు బట్టతలకూ, నీ ఊహ మోకాలికీ ముడిపెట్టి కార్యకారణ సంబంధం నిర్ణయించడం కూడా అలానే వుంది. నీ మనస్సంతా చిందరవందరగా ఆందోళనతో నిండి ఉంది. అందువల్ల నీవామెను గుర్తించలేకపోయావు. పేరూ, పూర్వపరిచయమూ స్ఫురణకు రాలేదు. జరుగుతున్న గొడవ ఆమెకు తెలిసి ఉండే అవకాశం ఉంది. అందువల్ల ఓదార్పుగా నీతో ఆమె ఆ మాటలని ఉంటుంది. నిన్నెప్పుడైనా ఎక్కడైనా ఏ స్వాములవారి దగ్గరో ఆమె చూసి ఉంటుంది. అందువల్ల ఆ పరిచయాన్ని ఆమె ప్రస్తావించి ఉంటుంది. ఇంతకూ నీ అభిప్రాయంతో నాకు తర్కమెందుకు? ఇంకా అనూహ్యమైన చిక్కులపాలు గాకుండా బయటపడ్డావు. అదే చాలు నాకు!" అన్నాడు సుందరం.

కృష్ణమూర్తి నిశ్చలంగా "కావచ్చునేమో! కాని, ఈ మధ్యనే నేను ఒక పుస్తకం చదివాను - అరుణాచలం రమణ మహర్షిని గురించి. ఆయన అన్నారు - ఇటువంటి సన్నివేశాలు సంభవమే, వాటినే దివ్యదర్శనాలు అంటారని ఆయన అనుగ్రహ పాత్రులకు చెప్పారు. మనకు తెలియని విషయాలను గూర్చి ఎందుకు వృథాగా అవును, కాదు అని గొడవ పడటం?" అన్నాడు.

"సుందరంగారూ! వడ్డించాను, లేవండి!" అంది సునంద.

(ఆంధ్రప్రభ - 1993)